సాక్షి
విశాఖపట్నం
సోమవారం | 13 | మార్చి | 2023



ప్రీ వెడ్డింగ్.. ట్రెండీ షూట్
పెళ్లంటే నూరేళ్ల పంట. మూడుముళ్లతో ఒక్కటయ్యే జంట.. ప్రీ వెడ్డింగ్ ఫొటో షూట్‌కు అమితాసక్తి చూపిస్తోంది. 8లో



గురుకులం పిలుస్తోంది..!
బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశం పొందేందుకు సమయం ఆసన్నమైంది. 11లో



ఆత్మ గౌరవానికి పవర్.!
మున్సిపల్ స్కూళ్ల హెచ్‌ఎంలకు డ్రాయింగ్ పవర్ కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 11లో

న్యూస్‌రీల్

హాల్ టికెట్ ఇవ్వకుంటే కఠిన చర్యలు

విశాఖ విద్య: ఫీజు బకాయి ఉందనే నెపంతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తే.. అలాంటి కాలేజీ యాజమాన్యాలపై కఠిన చర్యలకు సిఫారసు చేస్తామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జి.సీతారాం హెచ్చరించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఫీజుల వసూళ్ల పేరుతో కొన్ని కాలేజీ యాజమాన్యాల విద్యార్థులను వేధిస్తున్నట్లు కమిషన్ దృష్టికి వచ్చిందన్నారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులుంటే టోల్ ఫ్రీ నంబర్ 18004257635కు లేదా apscpcr2018@gmail.comకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

నేటి స్పందన రద్దు

మహారాణిపేట/డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. సోమవారం నిర్వహించే జీవీఎంసీ స్పందన కూడా రద్దు చేసినట్లు జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. నగర పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించే స్పందన కూడా రద్దు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ తెలిపారు.

ఏయూ, అనుబంధ కళాశాలలకు సెలవు
ఏయూక్యాంపస్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూ క్యాంపస్‌తో పాటు అనుబంధ కళాశాలల్లో పెద్దసంఖ్యలో పట్టభద్రులు ఓటర్లుగా ఉన్నారు. వీరంతా తమ స్వస్థలాలకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది.

మూడు రోజుల పాటు జైలులో నేషనల్ కాన్ఫరెన్స్

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ తెలిపారు. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో 'స్టేక్ హోల్డర్స్ కోఆర్డినేషన్ అండ్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్' అనే అంశంపై కాన్ఫరెన్స్ ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ డాక్టర్ ఇండ్ల శ్రీనివాస్‌తో పాటు తెలంగాణ, మేఘాలయ, కర్నాటక, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన జైళ్ల శాఖ అధికారులు కాన్ఫరెన్స్‌కు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

శ్రీవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం నేడు



కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సోమవారం జరగనుంది. ఈ మేరకు టీటీడీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 5 నుంచి 5.30 గంటల వరకు సుప్రభాత సేవ, 5.30 నుంచి 7 గంటల వరకు తోమాల సహస్ర నామార్చన, మొదటి గంట నిర్వహించనున్నారు. 7 నుంచి 12 గంటల వరకు భక్తులకు సర్వ దర్శనం, మధ్యాహ్నం 12 నుంచి 12.45 వరకు 2వ గంట, 12.45 నుంచి సాయంత్రం 6 గంట వరకు సర్వదర్శనం, సాయంత్రం 6.45 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వదర్శనం కల్పించనున్నారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు తిరుచ్చి ఉత్సవం జరగనుంది. శ్రీవారి ఆలయంలో విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని ఆలయ ఏఈవో రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి ఫీవర్ సర్వే



మహారాణిపేట: కొత్త రకం ఫ్లూ హెచ్3ఎన్2 వ్యాపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సోమవారం నుంచి ఫీవర్ సర్వే చేపట్టనుంది. వలంటీర్ల సహకారంతో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయనున్నారు. ఈ సర్వే వారం రోజుల పాటు సాగనుంది. జ్వరం, దగ్గు, తలనొప్పి, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించనున్నారు. జ్వర పీడితుల నుంచి రక్తం శాంపిల్స్ సేకరించి కేజీహెచ్‌లో ఉన్న వైరల్ ల్యాబ్‌లో పరీక్షలు జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. అక్కడి నుంచి వచ్చిన ఫలితం ఆధారంగా వాటిని తిరుపతి లేదా పుణే ల్యాబ్‌లకు పంపుతామని డీఎం హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల పరిధిలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 909 మంది ఆశా కార్యకర్తలు, 542 మంది ఏఎన్‌ఎంలు ఈ సర్వేలో పాల్గొంటున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సమరం నేడే

- ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం
- సాయంత్రం 4 గంటల్లోపు పోలింగ్ స్టేషన్‌లోకి వచ్చిన వారికే ఓటు వేసేందుకు అనుమతి
- భీమిలి బూత్‌లో అత్యధికంగా 1,399 మంది
- పోలింగ్ స్టేషన్‌ల వద్ద 144 సెక్షన్ అమలు

సాక్షి, విశాఖపట్నం: పట్టభద్రుల ఎన్నికల సమరం సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. 37 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని గ్రాడ్యుయేట్లు బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేయనున్నారు. ప్రాధాన్య క్రమంలో బ్యాలెట్‌పై జరిగే పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లను యంత్రాంగం పూర్తి చేసింది. ప్రత్యేకంగా రూట్‌ల వారీగా సిద్ధం చేసిన బస్సుల్లో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం నుంచి పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బందితో సామగ్రిని తరలించారు. పోలింగ్ స్టేషన్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమల్లోకి తీసుకొచ్చారు. సాయంత్రం 4 గంటల వరకు డ్రైడే అమల్లో ఉంటుంది.

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. 4 గంటల్లోపు పోలింగ్ స్టేషన్‌లోకి వచ్చిన వారికి మాత్రమే ఓటు వేసేందుకు అనుమతించనున్నారు. 4 గంటల తర్వాత వరసలో ఉన్న వారిని వీడియో తీసి టోకెన్లు అందిస్తారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి సంబంధించి 37 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ మద్దతు అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్, బీజేపీ నుంచి మాధవ్, టీడీపీ నుంచి చిరంజీవిరావు, పీడీఎఫ్ తరపున రమాప్రభ బరిలో ఉన్నారు. వీరితో పాటు స్వతంత్ర అభ్యర్థులు పోటీపడుతున్నారు. వీరందరి భవితవ్యం ప్రాధాన్య క్రమంలో నేడు ఓటర్లు తేల్చనున్నారు. తమ ఓటు హక్కుతో పెద్దల సభకు ఎవర్ని పంపించాలనేది నిర్ణయించనున్నారు. ఈ ఎన్నికల్లో తమ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌దే విజయమని వైఎస్సార్ సీపీ దీమాగా ఉంది. ఓటమి తప్పదని తెలిసి వైఎస్సార్ సీపీ విజయావకాశాలు దెబ్బతీసేందుకు టీడీపీ, పీడీఎఫ్ అడ్డదారులను తొక్కుతూ.. కలిసి కుయుక్తులు పన్నుతున్నాయి. మరోవైపు తమకు జనసేన మద్దతు ఉంటుందని భావించిన బీజేపీ.. ఆ ఛాయలేవీ కనిపించకపోవడంతో మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోంది. ఇలా ఎవరికివారు గెలుపుపై ఆశలు పెట్టుకున్నారు.

1055 మందితో ఎన్నికల విధులు
ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 1,055 మంది ఎన్నికల సిబ్బందిని నియమించారు. విశాఖపట్నం జిల్లాలో 657 మంది, అనకాపల్లి పరిధిలో 304, అల్లూరి జిల్లాలో 94 మంది ఎన్నికల సిబ్బంది ఇప్పటికే తమ సామగ్రితో ఆయా పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు. స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం నుంచి బస్సుల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచే బయలుదేరారు. అలాగే విశాఖ జిల్లాలో 112, అనకాపల్లిలో 49, అల్లూరి జిల్లాలో 15 వెబ్ కాస్టింగ్ వెబ్ కెమెరాలు ఏర్పాటు చేశారు.

సీలేరు పోలింగ్‌స్టేషన్‌లో అత్యల్పంగా...
పోలింగ్ స్టేషన్లను ఓటర్లకు అనువుగా ఏర్పాటు చేశారు. దీని ప్రకారం ఒక్కో జిల్లాలో అత్యధిక ఓటర్లు, అత్యల్ప ఓటర్లున్న పోలింగ్ బూత్‌లను గుర్తించారు. అల్లూరి జిల్లా పరిధి అప్పర్ సీలేరు ప్రాంతంలోని జెడ్పీ హైస్కూల్ బ్లాక్ నం.1లో ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌లో అత్యల్పంగా 56 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. పెదబయలులోని జెడ్పీ హైస్కూల్ 7వ తరగతి రూమ్‌లోని బూత్‌లో 1,191 మంది అత్యధికంగా ఓటర్లున్నారు. విశాఖపట్నం జిల్లా పరిధిలో రైల్వే న్యూ కాలనీలోని కేఎస్‌ఎం బాలికల హైస్కూల్ న్యూ బిల్డింగ్‌లోని పోలింగ్‌బూత్‌లో అత్యల్పంగా 211 మంది, భీమిలిలోని మూడో వార్డులోని జీవీఎంసీ ఎంఎఫ్‌సీ యూపీ స్కూల్‌లో 1,399 మంది అత్యధికంగా ఓటర్లు ఉన్నారు. అనకాపల్లి జిల్లాలోని ఉక్కునగరం జ్యోతి బాలవిహార్-3లో అత్యల్పంగా 85 మంది, అనకాపల్లి మెయిన్‌రోడ్డులోని జీవీఎంసీ హైస్కూల్ రూమ్ నం.9లో 1,357 మంది అత్యధికంగా ఓటర్లున్నారు.

పటిష్టమైన భద్రత ఏర్పాట్లు



సూచనలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. విశాఖ జిల్లా పరిధిలో 1,142, అనకాపల్లి జిల్లాలో 691, అల్లూరి జిల్లాలో 230 మంది పోలీసులను ఎన్నికల విధులను అప్పగించారు. అల్లూరి జిల్లా పరిధిలో 15 సున్నితమైన పోలింగ్ స్టేషన్లుగా గుర్తించి.. ఈ ప్రాంతాల్లో అదనంగా 4 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు, ఏపీఎస్‌పీ బృందాలు, 10 పార్టీల నడుమ భద్రత ఏర్పాట్లు చేశారు. రిటర్నింగ్ అధికారి డా.మల్లికార్జున ఆధ్వర్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎక్కడా ఇబ్బంది తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల కలెక్టర్లు ఆయా జిల్లాల్లో పోలింగ్ నిర్వహణ బాధ్యతలను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. విశాఖ జిల్లా పరిధిలో నగర పోలీస్ కమిషనర్, అనకాపల్లి, అల్లూరి జిల్లాల పరిధిలో ఆయా ఎస్పీలు బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు.



స్వర్ణభారతి స్టేడియం నుంచి ఎన్నికల సామగ్రిని తరలిస్తున్న సిబ్బంది



పోలీసుల బందోబస్తు

ఉమ్మడి విశాఖలో 176 కేంద్రాల్లో పోలింగ్

విశాఖపట్నం జిల్లాలో 112 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అనకాపల్లిలో 49, అల్లూరి జిల్లాలో 15 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి 2,89,214 ఓటర్లుండగా.. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధి అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11,525, విశాఖపట్నం జిల్లాలో 1,05,697, అనకాపల్లి జిల్లాలో 42,714 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇప్పటికే దాదాపు 98 శాతం మందికి ఎన్నికల సంఘం తరఫున ఓటరు స్లిప్పులు పంపిణీ చేశారు. మూడు జిల్లాల పరిధిలో మొత్తం 1,59,936 మంది ఓటర్లున్నారు. విశాఖలో 358, అనకాపల్లిలో 160, అల్లూరి జిల్లాలో 18 బ్యాలెట్ బాక్సులు చొప్పున మొత్తం 536 బ్యాలెట్ బాక్సులు వినియోగిస్తున్నారు. విశాఖ జిల్లాలో 1,09,400 బ్యాలెట్ పేపర్లు, అనకాపల్లిలో 44,200, అల్లూరిలో 12 వేలు చొప్పున మొత్తం ఉమ్మడి విశాఖలో 1,65,600 బ్యాలెట్ పేపర్లను ఆయా పోలింగ్ స్టేషన్లకు పంపించారు.



వేపగుంట జెడ్పీ హైస్కూలులో పోలింగ్ కోసం సిద్ధమవుతున్న సిబ్బంది

ఉమ్మడి విశాఖ జిల్లాలో పోలింగ్ వివరాలివీ

బరిలో ఉన్న అభ్యర్థులు	37 మంది
పోలింగ్ సమయం	ఉ.8 నుంచి సా.4 గం.
పోలింగ్ బూత్‌లు	176
ఓటు ఉన్న పట్టభద్రులు	1,59,936
వినియోగిస్తున్న బ్యాలెట్ బాక్సులు	536
సిద్ధం చేసిన బ్యాలెట్ పేపర్లు	1,65,600
విధులు నిర్వర్తిస్తున్న ఎన్నికల సిబ్బంది	1055
విధుల్లో ఉన్న భద్రతా సిబ్బంది	2063 మంది

సాగర తీరంలో సీ-వీడ్ సాగు

- ఇందుకు విశాఖ తీరం అనుకూలం
- మత్స్యకార, డ్వాక్రా మహిళలకు అవకాశం
- విశాఖ, అనకాపల్లి జిల్లాలకు 2,700 యూనిట్లు మంజూరు
- సీవీడ్‌లో అత్యధిక ఔషధ గుణాలు
- రాష్ట్రంలో తొలిసారిగా సాగుకు మత్స్యశాఖ సన్నాహాలు



సాక్షి, విశాఖపట్నం: ఎన్నో పోషక విలువలు, మరెన్నో ఔషధ గుణాలు కలిగిన సీ-వీడ్ (మొక్కలాంటి ఒక రకం సముద్రపు నాచు) సాగుపై ఆసక్తి పెరుగుతోంది. ఇందుకు విశాఖ సాగర తీరం ఎంతో అనుకూలంగా ఉంది. మారుతున్న జీవన శైలి, ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతున్న నేపథ్యంలో సీ-వీడ్, దీని ఆధారిత ఆహార ఉత్పత్తులపై ప్రజలకు మక్కువ అధికమవుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ (ఐఏఆర్ఐ), సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (సీఐఎఫ్‌టీ)లు ఈ సీ-వీడ్ సాగును ప్రోత్సహిస్తున్నాయి. సీ-వీడ్‌తో విభిన్న ఆహార ఉత్పత్తుల తయారీపై ఆసక్తిని, వినియోగాన్ని పెంచడంపై దృష్టి సారిస్తున్నాయి. గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో ఇప్పటికే సీ-వీడ్‌తో సూప్‌లు, నూడుల్స్, పాస్తాల్లో పొడి, రోల్ రూపంలో తినడానికి వీలుగా తయారు చేస్తున్నారు. ఇంకా బిస్కెట్లు, కుకీస్, న్యూట్రియెంట్ బార్స్, బ్రెడ్లు, సాచెట్లు వంటివి తయారీకి సన్నాహాలు జరుగుతున్నాయి. సీ-వీడ్‌తో తినే పదార్థాలు, సూప్, సాచెట్లు వంటివి తయారుకు అవసరమైన సాంకేతికతను విశాఖలోని ఐకార్-సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు.

ఉమ్మడి విశాఖలో అనుకూల ప్రాంతాలు
ఆంధ్రప్రదేశ్‌లో 49 ప్రాంతాల్లో తీరానికి ఆనుకుని సముద్రంలో 1,215 హెక్టార్లు సీ-వీడ్ పెంపకానికి అనువైన ప్రాంతం ఉన్నట్టు సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) శాస్త్రవేత్తలు గుర్తించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆర్కే బీచ్ వద్ద 40 హెక్టార్లు, వుడా పార్క్ 10, తెన్నేటి పార్క్ 50, తొట్లకొండ 25, భీమిలి 25, తిమ్మాపురం 50, మంగమారిపేట 50, ఎండాడ 25, ముత్యాలమ్మపాలెం 25, పూడిమడక 50, బంగారమ్మపాలెం 25, రాంబిల్లి ప్రాంతంలో 25 వెరసి 400 హెక్టార్లు అనుకూలంగా ఉందని తేల్చారు.

మంగమారిపేటలో పైలట్ ప్రాజెక్టు
సీ-వీడ్ సముద్రంలో సహజ సిద్ధంగానే పెరుగుతుంది. ఇప్పుడు దీనిని కృత్రిమంగానూ పెంచేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. పైలట్ ప్రాజెక్టు కింద భీమిలి మండలం మంగమారిపేటను సీ-వీడ్ సాగు కోసం ఎంపిక చేశారు. సీఎంఎఫ్ఆర్ఐ నేతృత్వంలో అక్కడ రాఫ్ట్ మోడల్‌లో కప్పాఫాగస్ అనే రకం సీ-వీడ్‌ను సాగు చేయనున్నారు. సముద్రతీరానికి 250-300 మీటర్ల దూరంలో కెరటాల ఉధృతి తక్కువగా ఉన్న ప్రాంతంలో సీ-వీడ్ సాగుకు అనువుగా ఉంటుంది. అక్కడ వెదురుకర్రలతో మంచాల మాదిరిగా సముద్రంపై తేలియాడేలా రాఫ్ట్‌లను నిర్మిస్తారు. అవి కెరటాలకు కొట్టుకుపోకుండా దిగువన సిమెంట్ దిమ్మెలను ఏర్పాటు చేసి వాటిని గొలుసులతో కడ్తారు.

2,700 యూనిట్ల మంజూరు
ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు 2,700 సీ-వీడ్ యూనిట్లు మంజూరయ్యాయి. ఒక్కొక్కరికి కనీసం 10 యూనిట్లు కేటాయించవచ్చు. ఒక్కో యూనిట్ విలువ రూ.1,500 ఉంటుంది. ఇందులో ఎస్సీ, ఎస్టీ మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం చొప్పున సబ్సిడీ ఇస్తారు. ఒకసారి వేసిన సీ-వీడ్ 40-45 రోజుల్లో కోతకు వస్తుంది. పది కిలోల సీ-వీడ్ విత్తనం వేస్తే వంద కిలోల దిగుబడినిస్తుంది. అనంతరం దానిని పది రోజుల పాటు ఎండబెట్టాల్సి ఉంటుంది. పది కిలోల పచ్చి సీ-వీడ్ ఎండాక మూడు కిలోలకు తగ్గుతుంది. ప్రస్తుత మార్కెట్లో కిలో సీ-వీడ్ ధర రూ.వెయ్యి వరకు ఉంది. ఇలా ఏడాదిలో వర్షాకాలం 2-3 నెలలు మినహా మిగతా కాలమంతా సీ-వీడ్ సాగుకు అనుకూలమే.

సీ-వీడ్‌తో ప్రయోజనాలివీ..

సీ-వీడ్‌లో తినడానికి వీలయ్యే 221 రకాల జాతులున్నాయి. వీటిలో సోడియం, కాల్షియం, క్లోరిన్, మెగ్నీషియంలతో పాటు ప్రొటీన్లు, ఫైబర్, విటమిన్లు, ఫోలిక్ యాసిడ్లు, తక్కువ కొవ్వు, కేలరీలు ఉంటాయి. సీ-వీడ్‌తో తయారైన ఆహార పదార్థాలను తినడం వల్ల క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, హెచ్‌ఐవీ, కోవిడ్ వంటివి నియంత్రణలోకి వస్తాయని సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

నెల రోజుల్లో సాగుకు శ్రీకారం



సీ-వీడ్ సాగుపై అసక్తి ఉన్న వారికి అవగాహన కల్పిస్తున్నాం. దీని సాగు విధానం, వచ్చే ఆదాయం, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, సీఎంఎఫ్ఆర్ఐ, సీఐఎఫ్‌టీల సాంకేతిక సహకారాన్ని వివరిస్తున్నాం. మంగమారిపేట తీరంలో మరో నెల రోజుల్లో సీ-వీడ్ సాగుకు శ్రీకారం చుడతాం. మలిదశలో భీమిలి తీరంలో దీని సాగు చేపట్టాలని యోచిస్తున్నాం.

-పి.కృష్ణ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్, పీఎంఎంఎస్‌వై

సీ-వీడ్ పెంపకం లాభదాయకం



సముద్రంలో సీ-వీడ్ పెంపకం లాభదాయకంగా ఉంటుంది. వీటి పెంపకానికి ప్రభుత్వం రాయితీ కూడా ఇస్తుంది. మత్స్యకారులతో పాటు ఇతర వర్గాలు కూడా ఈ యూనిట్ల మంజూరుకు అర్హులే. ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సద్వినియోగం చేసుకోవాలి.

-జి.విజయ, జిల్లా మత్స్యశాఖ అధికారి, విశాఖ

ప్రజాపథమే అజెండా

- వైఎస్సార్ ఆశయాలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆయువు
- టీటీడీ చైర్మన్, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల

సాక్షి, విశాఖపట్నం: మహానేత వైఎస్సార్ ఆశయాల నుంచి పుట్టిన వైఎస్సార్ సీపీ.. నాటి నుంచి నేటి వరకు ప్రజాపథమే అజెండాగా పనిచేస్తోందని టీటీడీ చైర్మన్, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వై.వి.సుబ్బారెడ్డి పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాత కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్యేతో ప్రారంభమైన వైఎస్సార్ సీపీ ప్రస్థానం.. ప్రస్తుతం 151 మంది ఎమ్మెల్యేలు, 22 మంది లోక్‌సభ, 9 రాజ్యసభ సభ్యులతో జాతీయ స్థాయిలోనే పెద్ద పార్టీల్లో ఒకటిగా నిలిచిందన్నారు. ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప రాజకీయ నాయకుడుగా ఎదిగారన్నారు. ప్రజాసంకల్ప యాత్రలో ప్రజల సమస్యలను తెలుసుకొని మ్యానిఫెస్టో పెట్టి ఈ నాలుగేళ్లలో 97 శాతం పూర్తి చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కిందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సుభిక్షమైన పాలన జరుగుతుందని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. పేదలకోసం పుట్టిన వైఎస్సార్ సీపీ నేడు కోట్లాది మంది నాయకులను, కార్యకర్తలను, అభిమానులను సొంతం చేసుకుందన్నారు. మేయర్ గొలగాని హరివెంకట కుమారి మాట్లాడుతూ ఒక వ్యక్తితో ప్రారంభమైన వైఎస్సార్‌సీపీ నేడు మహా శక్తిగా ఎదిగిందని కొనియాడారు. రానున్న కాలంలో టీడీపీని భూస్థాపితం చేయడంతోపాటు జాతీయ స్థాయిలో కూడా దూసుకుపోతుందన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ వెనుకబడిన మత్స్యకారులను గుర్తించి మంత్రిగా, ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించిన ఏకైక సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు కె.కె రాజు, అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్సీ అభ్యర్థి కోలా గురువులు, కార్పొరేషన్ చైర్మన్లు జాన్‌వెస్లీ, మధుసూదన్‌రావు, పిల్లి సుజాత, పిల్లా సుజాత, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, ఎస్.ఎ.రెహమాన్, గురుమూర్తిరెడ్డి, జోనల్, జిల్లా పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు గరికిన గౌరి, కృపాజ్యోతి, ముఖ్యనేతలు రవిరెడ్డి, హనోక్, కొండా రాజీవ్ గాంధీ, అల్లు శంకర్రావు, మారుతి ప్రసాద్, కాశీవిశ్వనాథం, మాధవివర్మ, ఆళ్వాకృష్ణ, ఎండీ షరీఫ్, అల్లంపల్లి రాజుబాబు, ఫరూఖీ, సతీష్‌వర్మ, శ్రీదేవి వర్మ, ద్రోణంరాజు శ్రీవాత్సవ, కాశి విశ్వనాథం, కాంతారావు, బోని శివ రామకృష్ణ, కృష్ణంరాజు, రాయుడు శ్రీను, పీలా వెంకటలక్ష్మి, పేడాడ రమణకుమారి, అజయ్‌కుమార్, చొక్కర శేఖర్, అంగా రాంప్రసాద్, పాల్గొన్నారు.

మార్గదర్శి సీనియర్ మేనేజర్ అరెస్టు

ఈ నెల 24 వరకు రిమాండ్

విశాఖలీగల్: సంచలనం సృష్టించిన మార్గదర్శి చిట్‌ఫండ్ కేసులో అరెస్టుల పర్వం మొదలైంది. మూడో నిందితుడుగా పేర్కొన్న సీతంపేటలోని మార్గదర్శి ప్రధాన కార్యాలయం సీనియర్ మేనేజర్ కామినేని రామకృష్ణను ఆదివారం సాయంత్రం సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. రాత్రి 8 గంటల సమయంలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.తిరుమలరావు ఎదుట హాజరుపరిచారు. రిమాండ్ రిపోర్టును పరిశీలించిన న్యాయమూర్తి.. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శేషు, రామకృష్ణ న్యాయవాది పి.శ్రీకాంత్‌ల వాదనలు విన్నారు. అనంతరం రామకృష్ణకు ఈ నెల 24 వరకు రిమాండ్ విధించారు. అతడిని రాత్రి 10 గంటల సమయంలో సీఐడీ ప్రత్యేక అడిషనల్ ఎస్పీ రవివర్మ, సిబ్బందితో కలిసి కేంద్ర కారాగారానికి తరలించారు. చిట్‌ఫండ్ చట్టం సెక్షన్ 5, 76, 79 భారత శిక్షాస్మృతి 409, 417, 420, 477(సీఏ) సెక్షన్ల కింద సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. విశాఖలోని మార్గదర్శి అన్ని బ్రాంచ్‌ల టర్నోవర్ రూ. 200 కోట్లకు పైగా ఉండగా.. కోట్లాది రూపాయల అనధికారిక లావాదేవీలు జరిగినట్లు సీఐడీ అధికారులు గుర్తించారు.



చిన్నారి ప్రదర్శనను తిలకిస్తున్న నగరవాసులు

అలరించిన ప్రదర్శనలు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ ఆధ్వర్యంలో ఆర్.కె.బీచ్‌లో వైజాగ్ గాట్ టాలెంట్ పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో నగర కళాకారులు తమ ప్రతిభను చూపిస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు డ్యాన్స్, పాటలు, నటన, స్కిట్లతో సందర్శకులను అలరిస్తున్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు పర్యవేక్షణలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఆదివారం పెద్ద సంఖ్యలో నగరవాసులు పాల్గొని తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమం శని, ఆదివారాల్లో ఉంటుందని.. ఆసక్తి ఉన్న వారు సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

• అమ్మ దీవెన



శ్రీకృష్ణాపురం గురుకులంలో ఇంటర్ విద్యార్థులను దీవిస్తున్న వారి తల్లులు

ఆరిలోవ(విశాఖ తూర్పు): శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ ఆధ్వర్యంలో ఆదివారం 'కన్నవారి దీవెనలు'కార్యక్రమం నిర్వహించారు. త్వరలో పరీక్షలు రాయనున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు తమ తల్లుల కాళ్లకు నమస్కారం చేశారు. బాగా పరీక్షలు రాయాలంటూ ఆ తల్లులు తమ పిల్లలకు అక్షింతలు వేసి, ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు తల్లిదండ్రుల దీవెనలు అందించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో గరుకులం ఉపాధ్యాయులు, గురుకులం తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కె.గోవింద్ పాల్గొన్నారు.



విరబూసిన చిరునవ్వులు

జీ-20 సదస్సు నేపథ్యంలో మహా విశాఖలో పచ్చదనం పరచుకుంటోంది. డివైడర్ల మధ్యలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని జీవీఎంసీ అధికారులు విస్తృతం చేశారు. జీచ్‌రోడ్డులో ఓ తల్లి పనిలోనే ఆనందం వెతుక్కుంటూ.. బిడ్డను లాలిస్తోంది. ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్

ప్రీ వెడ్డింగ్ ట్రెండీ షూట్

పెళ్లంటే పందిళ్లు.. సందళ్లు.. తప్పెట్లు.. తాళాలు.. తలంబ్రాలు.. ఆత్రేయ రాసిన పాట ఇది.. ఇప్పటి పరిస్థితులను బట్టి చూస్తే వాటి సరసన ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్ కూడా చేర్చేవారేమో మనసు కవి! నాటికీ.. నేటికీ పెళ్లి సంప్రదాయాల్లో ఎన్నో మార్పులు.. ఎప్పటికప్పుడు సరికొత్తగా చేరుతున్నాయి. కొన్నాళ్లుగా సినిమా స్టైల్‌లో ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్ కల్చర్ క్రేజీగా మారింది. విశాలమైన తీరం.. ప్రకృతి అందాలకు మన పరిసరాలు నెలవు కావడంతో.. ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్‌లకు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచీ తరలివస్తున్నారు. ప్రకృతి అందాల మధ్య కొత్త జంటలు ఫొటోలు దిగి.. ఆ జ్ఞాపకాలను పదిలపరుచుకుంటున్నాయి.

- విశాఖపట్నం డెస్క్

- ఆసక్తి చూపిస్తున్న నవ వధూవరులు
- విశాఖలో అందమైన లొకేషన్లే వేదికలు
- సినిమాలకు దీటుగా చిత్రీకరణ
- పెళ్లిళ్ల సీజన్‌లో ఫొటోగ్రాఫర్లకు పండగే..



పెళ్లంటేనే ఓ పండగ.. ఇల్లంతా పచ్చటి తోరణాలు, చుట్టాల ముచ్చట్లు, ఆడవాళ్ల ఆభరణాలు, పట్టుచీరల సోయగాలు, పిల్లల కోలాహలంతో.. పెళ్లి ఇంట సందడే సందడి. మూడు ముళ్లతో ఒక్కటయ్యే జంట సంగతి చెప్పనక్కరలేదు. చిలిపి ఆలోచనలు, సిగ్గు తెరలు, ముసిముసి నవ్వులు, అందమైన అలంకరణలో మెరిసిపోతుంటారు వధువు, వరుడు. వివాహం నిశ్చయమైన నాటి నుంచి పెళ్లి పనులు, షాపింగ్‌లతో ఇరు కుటుంబాల సభ్యులు క్షణం తీరిక లేకుండా గడుపుతుంటారు. ఇంతటి సందడిలో కొత్తజంట అదిరిపోయేలా కనిపించాలి కదా.. ఈ పెళ్లి తంతు సన్నివేశాలను ఓ మధుర జ్ఞాపకంలా దాచుకోవాలంటే ఫొటోషూట్‌లు జరగాల్సిందే. ఒకప్పుడు పెళ్లి వేడుకకు సంబంధించి ఫొటోలు, వీడియోలకు మాత్రమే ప్రాధాన్యం ఉండేది. తర్వాత ట్రెండ్ మారింది. ప్రస్తుతం ఫొటోషూట్‌కు విపరీతమైన క్రేజ్ పెరిగింది. సినిమాలకు దీటుగా చిత్రీకరించేందుకు ఎంత ఖర్చుకైనా వెనుకాడడం లేదు. తమకు ఇష్టమైన స్పాట్‌లకు వెళ్లి అందమైన దుస్తులతో నచ్చే విధంగా ఫొటోలు, వీడియోలు తీయించుకుంటున్నారు. సినిమా తరహాలో సినీ, జానపద గీతాలకు నటించి.. వాటిని పెళ్లి జరిగే రోజు ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో నగరంలోని అందమైన లొకేషన్లన్నీ ఫొటోషూట్‌లతో కళకళలాడుతున్నాయి.

మేకింగ్ సమయం

సూర్యోదయ సమయం, ఉదయం 9 గంటల లోపు బహిరంగ ప్రదేశాలు, సముద్ర తీర ప్రాంతాల్లో ఫొటోషూట్‌కు వాతావరణం అనుకూలంగా ఉంటుంది. అదే పార్కుల్లో అయితే ఉదయం, మధ్యాహ్నం వేళల్లో బాగుంటుంది. సాయంత్రం, రాత్రి వేళల్లో కూడా ఫొటో షూట్‌కు కొన్ని జంటలు ఇష్టపడుతుంటాయి. ఈ ప్రీ వెడ్డింగ్ షూట్‌లో ఫొటోగ్రాఫర్లు ఖరీదైన వీడియో, స్టిల్, డ్రోన్ కెమెరాలు ఉపయోగిస్తున్నారు.

దుస్తులపై ప్రత్యేక శ్రద్ధ

ఫొటోషూట్‌లో మొదటి ఆకర్షణ దుస్తులదే.. కాబోయే జంటలు అందంగా కనిపించేందుకు, ఫొటోలు కాంతివంతంగా వచ్చేందుకు డార్క్ కలర్స్ గల కాస్ట్యూమ్స్‌పై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. నీలి సంద్రాన్ని సైతం మైమరిపించేలా దుస్తులను ఎంపిక చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో దుస్తులను అద్దెకు కూడా తెచ్చి ఈ షూట్లను ఏర్పాటు చేస్తున్నారు. నిశ్చితార్థం నుంచి మెహందీ, సంగీత్, వివాహ తంతు ముగిసి.. ఫొటో ప్రింట్స్ చేతికి ఇచ్చేంత వరకు సుమారు రూ.లక్ష నుంచి రూ.6 లక్షల వరకు ఫొటోగ్రాఫర్లు చార్జ్ చేస్తున్నారు.



మనసు దోచే లొకేషన్లు

ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్, కవర్ సాంగ్స్ ఎక్కడ చేద్దామంటే.. తక్కున గుర్తొచ్చేవి విశాఖలోని సుందరమైన బీచ్‌లు, పేరొందిన పార్కులు, ఆధ్యాత్మిక ప్రదేశాలు. ఆర్.కె. బీచ్, తెన్నేటి పార్క్ బీచ్, రుషికొండ, తొట్లకొండ, యారాడ, భీమిలి తీరాల్లో జోరుగా ఫొటోషూట్లు జరుగుతున్నాయి. కైలాసగిరి, తెన్నేటి పార్కు, వీఎంఆర్డీఏ పార్కు, ముడసర్లోవ పార్కు, కంబాలకొండ వంటి మరెన్నో అందమైన ప్రదేశాల్లో సందడి నెలకొంది. పరవాడలోని తంతడి బీచ్, అచ్యుతాపురం కొండకర్ల ఆవ తదితర మనసు దోచే లొకేషన్లు నవ వధూవరులను ఆకర్షిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఫొటోలు దిగి.. ట్రెండ్‌కు తగ్గట్టుగా తమ పెళ్లి పుస్తకంలో రంగుల పేజీలు సృష్టిస్తున్నారు.



కొండకర్ల ఆవ సరస్సులో.. ఒకరికి ఒకరు

ఫొటోగ్రాఫర్లు బిజీబిజీ

పెళ్లిళ్ల సీజన్ మొదలైందంటే చాలు ఫొటో, వీడియోగ్రాఫర్లకు చేతి నిండా పని ఉంటుంది. ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్‌లతో బిజీగా మారిపోతారు. కొత్త జంటల అభిరుచులను అనుగుణంగా మంచి లొకేషన్లలో ఫొటోలు తీస్తుంటారు. పెళ్లి రోజు నాటికి అదిరిపోయేలా బ్యానర్లు సిద్ధం చేస్తారు. గతంలో పెళ్లిళ్లు, పేరంటాలకు మాత్రమే ఫొటోలు తీయించుకునేవారు. ప్రస్తుతం పెళ్లితో పాటు ప్రీ-వెడ్డింగ్, పోస్ట్-వెడ్డింగ్ ఫొటోషూట్‌లకు ఆసక్తి చూపిస్తున్నారు. ఫొటోగ్రాఫర్ స్వయంగా వెళ్లి తీయలేని యాంగిల్స్‌లో డ్రోన్, క్రేన్‌లను ఉపయోగిస్తున్నారు. సినిమా పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఆ వీడియోలను ఎడిటింగ్ చేయించుకుంటున్నారు. ఈ వీడియోలను పెళ్లి సమయంలో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌లపై ప్రదర్శిస్తున్నారు.



పెళ్లి ఓ మధుర ఘట్టం

పెళ్లి.. ఓ మధుర ఘట్టం. అలాంటి పెళ్లి వేడుకలు జీవితాంతం గుర్తుండి పోయేందుకు ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్ మంచి అనుభూతినిస్తుంది. మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకునేందుకు దోహదపడుతుంది. పెళ్లి ఆల్బమ్ కోసం ముందు నాలుగైదు ఫొటోలు తీసుకుంటే చాలనుకున్నాం. ఫొటోషూట్ జరిగే కొద్దీ చాలా బాగుందనిపించడంతో విశాఖలోని అందమైన లొకేషన్లలో ఎక్కువ ఫొటోలు తీసుకున్నాం. – సీతారాం, స్వాతి, ఆరిలోవ కాలనీ



జ్ఞాపకాలు పదిలం

ఫొటోషూట్ అంటే చాలా ఇష్టం. పెళ్లి నాటి జ్ఞాపకాలను పదిలపరచుకునేందుకు ఫొటోషూట్ చేయించాం. నాలుగైదేళ్ల తర్వాత మా పెళ్లి ఫొటోలు చూసుకుంటే చాలా ఆనందంగా ఉంటుంది. పాత జ్ఞాపకాలన్నీ కళ్ల ముందుకొస్తాయి. ఇప్పటి ట్రెండ్‌కు తగ్గట్టు ఫొటోషూట్ చేయించుకున్నాం. ఆ సమయంలో కొంచెం కొత్తగా.. కంగారుగా అనిపించినా.. బోలెడన్ని జ్ఞాపకాలు మిగిలాయి.

– మోహన్, దుర్గ, ఆరిలోవ

జీవితాంతం గుర్తుండి పోతుంది

ఫొటోషూట్ ఓ అందమైన జ్ఞాపకం. జీవితాంతం గుర్తుండిపోయేలా చేస్తుంది. పెళ్లికి ముందు కచ్చితంగా ఫొటోషూట్ చేయించుకుని జ్ఞాపకంలా దాచుకుందామనుకున్నాం. అనుకున్నట్లే ఫొటోషూట్ అద్భుతంగా జరిగింది. వైజాగ్‌లోని మంచి లొకేషన్లలో ఫొటోలు తీసుకున్నాం. ఎక్కడా రిస్క్ లేకుండా చూసుకున్నాం. రిస్క్ లేని లొకేషన్లలో ఫొటోలు తీసుకోవడం మంచిది.

– నవ్య, సంతోష్, శ్రీకాకుళం

వధూవరులు మెచ్చేలా ఫొటోషూట్



మారుతున్న కాలానికి అణుగుణంగా నూతన జంటలు ప్రీ వెడ్డింగ్ ఫొటో షూట్‌కు ఇష్టపడుతున్నారు. వారి అభిరుచికి తగ్గట్టుగా ఫొటో షూట్ ప్లాన్ చేస్తాం. నగరంలోని చక్కని లొకేషన్లకు తీసుకెళ్తాం. పెళ్లిళ్ల సీజన్‌లోనే చేతినిండా పని ఉంటుంది. ఒక్కో రోజుకు మూడు నాలుగు జంటలకు ఫొటోషూట్ చేయాల్సి ఉంటుంది. పెళ్లి తంతు ముగిసే వరకు తీరిక దొరకదు. సినిమాలను తలపించేలా చిత్రీకరిస్తుండడంతో యువతీ యువకుల్లో ఆసక్తి పెరుగుతోంది.

– కె.రత్నంరాజు, ఫొటోగ్రాఫర్, శ్రీకాంత్‌నగర్, ఆరిలోవ

రోడ్డు ప్రమాదంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి దుర్మరణం



వైకుంఠరావు(ఫైల్)

కూర్మన్నపాలెం : స్టీల్‌ప్లాంట్ ప్రధాన మార్గంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉక్కు ఉద్యోగి, త్రిఫ్ట్ సొసైటీ మాజీ డైరెక్టర్ వై.వైకుంఠరావు(52) మృతి చెందారు. ప్రమాదానికి సంబంధించి స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కూర్మన్నపాలెం నుంచి కణితి మార్గంలో ఆదివారం ఉదయం వాకింగ్‌కు వెళ్తున్న వైకుంఠరావును అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న పాల సరఫరా వ్యాన్ బలంగా ఢీకొట్టింది. దీంతో వైకుంఠరావుకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ వైకుంఠరావు మృతి చెందారు. కూర్మన్నపాలెంలో నివసిస్తున్న వైకుంఠరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపోలోలో అధునాతనంగా శస్త్రచికిత్సలు



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు


కొమ్మాది: విశాఖలోని అపోలో ఆస్పత్రిలో అధునాతన శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు సీనియర్ గైనకాలజిస్ట్ శశిప్రభ తెలిపారు. రుషికొండ రాడిసన్ బ్లూలో ఆదివారం గైనకాలజీలో రోబోటిక్స్‌పై సీఎంఈ లైవ్ వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైజాగ్ అపోలోలో డాక్టర్ కిరణ్మయి ఆధ్వర్యంలో వైద్య బృందం గైనకాలజీలో తొలి రోబోటిక్ సర్జరీని విజయవంతంగా చేసిందని వెల్లడించారు. ఇది రాష్ట్రంలోనే తొలి రోబోటిక్ సర్జరీ అని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న రోగులకు అధునాతన చికిత్స అందించడంలో అపోలో ఆస్పత్రులు ఎప్పుడూ ముందుంటాయని వెల్లడించారు. జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రికి చెందిన డా.రూమా సిన్హా, విశాఖ అపోలో ఆస్పత్రి నుంచి గైనకాలజిస్టులు, లాప్రోస్కోపిక్ రోబోటిక్ సర్జన్లతో కలసి డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ శ్రీదేవి మైయోమెక్టమీ, రోబోటిక్ హిస్టరెక్టమీ వంటి క్లిష్టమైన లైఫ్ సర్జరీలను ఇక్కడ ప్రదర్శించారు. ఇప్పటికే అపోలోలో గైనకాలజీ, యూరాలజీ, జనరల్, జీఐ సర్జరీ, అంకాలజీ తదితర విభాగాల్లో దాదాపు 100 శస్త్ర చికిత్సలు చేసినట్లు తెలిపారు. అపోలో సీఈవో వై.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అనుభవజ్ఞులైన సర్జన్లతో అత్యాధునిక చికిత్సలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి 150 మంది ప్రతినిధులు, గైనకాలజిస్టులు హాజరయ్యారు.

నూకాంబిక వెండి ఆభరణాల ఊరేగింపు



మాడుగుల రూరల్: కె.జె.పురంలో నూకాంబిక అమ్మవారి మాలాధారణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. గురుమాత శీలం దేముళ్లు పర్యవేక్షణలో 15 మంది భక్తులు మాలాధారణ చేశారు. కొత్త అమావాస్య వరకు వీరు దీక్షలో ఉంటారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, భక్తులు సహకారంతో తయారు చేయించిన వెండి ఆభరణాలు కిరీటం, వడ్డాణం, పాదాలను ఊరేగించి అమ్మవారికి అలంకరించారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.102
స్కిన్	: రూ.174
స్కిన్‌లెస్	: రూ.184

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	435.00
విజయనగరం	439.00
శ్రీకాకుళం	439.00

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.56,890
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.52,150
వెండి(కిలో):	రూ.68,700

24న కథ వెనుక కథ చిత్రం విడుదల



సమావేశంలో మాట్లాడుతున్న గొట్టిపాటి సాయి

డాబాగార్డెన్స్: దండమూడి బాక్స్ ఆఫీస్ పతాకంపై దండమూడి అవనీంద్రకుమార్ నూతనంగా నిర్మించిన 'కథ వెనుక కథ' చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ఆదివారం విశాఖలో సందడి చేసింది. మీడియా సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గొట్టిపాటి సాయి మాట్లాడుతూ కథ వెనుక కథ చిత్రం ఆద్యంతం అందర్నీ ఆకట్టుకునే సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందించామన్నారు. ఇందులో రెండు పాటలు ఉంటాయని, ఒకటి గోవాలో, ఐటమ్ సాంగ్ హైదరాబాద్‌లో చిత్రీకరించామన్నారు. సెంటిమెంట్‌గా తనను ఈ స్థాయికి తీసుకు వచ్చింది వైజాగేనని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం చిత్ర హీరో (ఓ పిట్ట కథ ఫేమ్) విశ్వంత్ మాట్లాడుతూ తన కెరీర్లో ఈ చిత్రం ఓ మైలురాయిలా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చిన్నప్పుడు విశాఖలోనే చదువుకున్నానని చెప్పారు. చిత్ర దర్శకుడు కృష్ణచైతన్య, హీరోయిన్లు శ్రీజిత ఘోష్, శుభశ్రీ, ప్రముఖ కమెడియన్ మధు నందన్ మాట్లాడుతూ తమను ఆదరించి, సినిమా విజయవంతం చేయాలని కోరారు.

పంప్‌డ్ స్టోరేజీ ప్రాజెక్ట్ స్థల పరిశీలన



ఇసుకకోరి ప్రాంతాన్ని సందర్శించిన డైరెక్టర్ సత్యనారాయణ, అధికారులు

సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లో నిర్మించబోయే పంప్‌డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ ప్రదేశాలను ఆదివారం జెన్‌కో హైడల్ డైరెక్టర్ సత్యనారాయణ పరిశీలించారు. తొమ్మిది యూనిట్లతో 1300 మెగావాట్ల ప్రాజెక్టుకు నిర్మించే పార్వతీనగరం, నీరు మళ్లించే ఇసుకకోరి, డీఆర్పీ క్యాంపు బూసుకొండ గ్రామాలను పరిశీలించారు. ప్రాజెక్ట్ మ్యాప్‌ను పరిశీలించిన ఆయన ఇంజనీర్లు, అధికారులకు సూచనలు చేశారు. వేసవిలో విద్యుత్ ఉత్పత్తి సరఫరాకు ఇబ్బంది లేకుండా మెరుగుపడేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట చీఫ్ ఇంజనీరు శ్రీధర్, బాలకృష్ణ, బాబురావు, లక్ష్మీనారాయణ, ప్రభాకర్, సురేష్ ఉన్నారు.

ఘటాలు, సారె ఊరేగింపు



రావికమతం: మండలంలోని కొత్తకోటలో నూకాంబిక అమ్మవారి ఆలయ 9వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. 10,11,12 తేదీల్లో నిర్వహించిన వారికోత్సవంలో భాగంగా ఆఖరి రోజు ఆదివారం భారీ ఎత్తున ఘటాలు, సారె ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో వేలాదిగా మహిళలు, గ్రామస్తులు, యువకులు తరలివచ్చారు. రోడ్లు కిక్కిరిసిపోయాయి.భారీ అన్నసమారాధన జరిపారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా కొత్తకోట పోలీసులు చర్యలు తీసుకున్నారు.